క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

హైదరాబాద్

23-11-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 244

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

'మంగళగిరి- తాడేపల్లి' కార్పొరేషన్ ఎవరిది?

టిడిపి అభ్యర్థిగా సామాన్య కార్యకర్త

కూటమి వైపే స్పష్టమైన మొగ్గు

క్రైమ్ మిర్రర్ గ్రౌండ్ రిపోర్ట్



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇప్పటికే తొలి విడత మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యాయి. కూటమి ఏకపక్షవిజయం సాధించింది. పరిషత్ ఎన్నికల్లోను అదే దూకుడు కనబరిచింది. ఇప్పుడు రెండో విడత మిగిలిన పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పుడు అందరి దృష్టి మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పై పడింది. ఈనెల 26న జరగనున్న

- మిగతా 2వ పేజీలో



హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు..

అప్రమత్తమైన పోలీస్ శాఖ

- హైదరాబాద్‌లో బాంబు దాడులు చేస్తామంటూ బెదిరింపు ఈమెయిల్
- నగరవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు
- వదంతులు నమ్మవద్దని నగర సీపీ విజ్ఞప్తి
- నిందితుల కోసం సైబర్ క్రైమ్ పోలీసుల ముమ్మర గాలింపు
- అనుమానం వస్తే వెంటనే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచన





వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ గా భారతి రెడ్డి!

వచ్చేయడానికి జగన్ పాదయాత్ర ప్రారంభం

రెండు సంవత్సరాల పాటు ప్రజల్లోనే..

పార్టీ పగ్గాలతో పాటు తాడేపల్లి కేంద్ర కార్యాలయం బాధ్యతలు సైతం..

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: వైయస్ భారతి రెడ్డికి పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారా? రెండు సంవత్సరాల పాటు ఆ బాధ్యతల్లో ఆమె ఉండనున్నారా? ఈ మేరకు జగన్మోహన్ రెడ్డి సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చారా? అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు సిద్ధపడుతున్నారు. రాష్ట్రంలో రెండేళ్ల పాటు సుదీర్ఘంగా పాదయాత్ర చేసేందుకు సన్నాహాల్లో ఉన్నారు. అందుకు సంబంధించిన

- మిగతా 3వ పేజీలో

ఆ దాత ఎవరు?



తిరుమల శ్రీవారికి 121 కేజీల బంగారం విరాళం

- రూ.250 కోట్ల విలువైన ఆభరణాలు
- గోప్యంగా భక్తుడి పేరు
- అంతటా ఇప్పుడు ఇదే చర్చ

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి. ఆ స్వామివారికి ఒక అజ్ఞాత భక్తుడు సమర్పిస్తున్న భారీ బంగారు ఆభరణాల

- మిగతా 2వ పేజీలో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2029లో జరుగుతాయా? బిజెపి జమిలీ అస్త్రం ప్రయోగించనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం 2028 నవంబర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాలి. కానీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని కేంద్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై పట్టు కోసం తెలంగాణతో పాటు కర్ణాటకలో ఎన్నికలను 2029కి వాయిదా వేయాలని చూస్తోంది.

ఆరు నెలలు పొడిగించే ఆలోచనలో కేంద్రం

సార్వత్రిక ఎన్నికలతో పార్టీ నిర్వహణ

తెర వెనుక బిజెపి భారీ వ్యూహం..

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో : ఇందుకు సంబంధించి రాజ్యాంగ సవరణలతో పాటు చట్ట సవరణల ద్వారా గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న వారి పదవీకాలం కొద్దికాలం పొడిగించడం.. లేకుంటే రాష్ట్రపతి పాలన విధించడం వంటి ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

దక్షిణాది రాష్ట్రాల్లో..: ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో లేదు. కేవలం ఏపీలో మాత్రమే టిడిపి తో సయోధ్య ఏర్పాటు చేసుకొని అధికారంలోకి రాగలిగింది. అక్కడ కూడా ఆ పార్టీకి బలం తక్కువ. అయితే 2023లో కర్ణాటకలో కాంగ్రెస్ చేతిలో ఓడిపోయింది బిజెపి. మరోసారి అక్కడ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలను ఆలస్యం చేసి 2029 సార్వత్రిక ఎన్నికలతో

- మిగతా 3వ పేజీలో

గోదావరి పుష్కరాలకు ప్రధాని మోదీ!





ప్రత్యేకంగా ఆహ్వానించిన చంద్రబాబు

ఏడాది పొడవునా పుష్కర స్నానాలు చేయాలని ప్రజలకు సూచన

ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు.. రూ.3700 కోట్లతో అభివృద్ధి పనులు

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో : గోదావరి పుష్కరాలకు సమయం ఆసన్నం అవుతోంది. మరో ఆరు నెలల్లో గోదావరి పుష్కర వేడుకలు జరగనున్నాయి. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు పుష్కరాలు కొనసాగునున్నాయి. పుష్కర ఏర్పాట్లకు సంబంధించి రూ.3700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

440 ఘాట్ల అభివృద్ధి, 4000 ప్రత్యేక బస్సులు, 1560 రైళ్ల ఏర్పాటు పై దృష్టి పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- మిగతా 2వ పేజీలో



విశాఖపట్నంలో ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి

- విశాఖపట్నం జిల్లాలో ఆటోను ఢీకొట్టిన లారీ
- ఆటోలోని నలుగురు అక్కడికక్కడే మృతి
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తింపు

- మిగతా 2,3వ పేజీలో

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

- నవంబర్ 27 తర్వాత బంగాళాఖాతంలో ఆవర్తనం ఏర్పడే అవకాశం
- అల్పపీడనంగా బలపడే సూచనలు
- ఏపీకి ప్రస్తుతానికి తుపాను ముప్పు లేదన్న నిపుణులు
- శ్రీలంక లేదా తమిళనాడు వైపు వెళ్లే అవకాశాలే ఎక్కువ
- తూర్పు గాలులతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు

దక్షిణ అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లో

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లు, కోటి ఓట్లు సాధిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి

రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు 15 లోక్‌సభ స్థానాలు గెలవాలని పార్టీ శ్రేణులకు పిలుపు

గతంలో టీడీపీ, బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ కూడా పదేళ్లు అధికారంలో ఉంటుందని వ్యాఖ్య

ప్రభుత్వంపై బహిరంగంగా మాట్లాడే నేతల తీరును నిశితంగా గమనిస్తున్నామని హెచ్చరిక

తెలంగాణ చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వెల్లడి



తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 స్థానాలు సాధించడంతో పాటు కోటి ఓట్లు పొంది తిరిగి అధికారాన్ని నిలబెట్టుకుంటుందని

మిగతా 2,లో

సిద్దిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక

సందడి చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు

త్వరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా

సర్వేలు సైతం బీఆర్ఎస్ పునరాగమనాన్ని స్పష్టం చేస్తున్నాయన్న నేత

సోషల్ మీడియాలో సదర్ ఫొటోలను పంచుకున్న హరీశ్ రావు

సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొని సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన ఈ వేడుకల్లో ఆయన యాదవ సోదరులతో కలిసి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక ప్రజలు, యువతతో మమేకమై పండుగ

మిగతా 2,లో





హైదరాబాద్ కు బాంబు బెదిరింపులు..

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులు జరపనున్నట్లు వచ్చిన ఒక బెదిరింపు ఈమెయిల్‌పై హైదరాబాద్ సిటీ పోలీసులు అత్యంత వేగంగా స్పందించారు. ఈమెయిల్ అందిన వెంటనే నగరవ్యాప్తంగా విస్తృత స్థాయిలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగర ప్రజల భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, ఎవరూ భయాందోళనలకు గురికావద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో నగరంలోని అనుమానిత, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా యాంటీ సబోటేజ్ తనిఖీలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల గస్తీని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. కీలక కూడళ్లు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి అనుమానితులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరోవైపు, ఈ బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపారు అనే వివరాలను రాబట్టేందుకు నగర సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లను విశ్లేషిస్తూ నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియాలో గానీ, బయట గానీ వచ్చే నిరాధారమైన వదంతులను ఎవరూ నమ్మవద్దని, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసి భయాందోళనలు సృష్టించవద్దని నగర ప్రజలకు సీపీ విజ్ఞప్తి చేశారు. నగరంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, లేదా గుర్తుతెలియని బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ '112' ద్వారా సమాచారం అందించాలని సూచించారు. హైదరాబాద్ పోలీస్ విభాగం 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ప్రతి ఒక్కరి రక్షణకు కట్టుబడి ఉందని అధికారులు భరోసా ఇచ్చారు.

సిద్దిపేటలో ఘనంగా నిర్వహించిన సదర్ వేడుక



శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులో హరీశ్ రావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపాగా ధరించి, చేతిలో హాకీ బ్యాట్ పట్టుకుని పైకెత్తుతూ యువతతో కలిసి జోష్ ప్రదర్శించారు. తనకు బహూకరించిన కత్తిని గాల్లోకి దూశారు. సిద్దిపేటలో జరిగిన ఈ సదర్ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఉత్సవాల అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలు సర్వేలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో సిద్దిపేట రాజకీయాల ప్రస్తావన రావడంతో వేదికపై సవాళ్లు, ప్రతిసవాళ్లు చోటుచేసుకున్నాయి. స్థానిక అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావచ్చంటూ నాయకులు ఒకరికొకరు సవాళ్లు విసురుకోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏదేమైనా, సంప్రదాయ ఉత్సవాలను ప్రజలంతా కలిసికట్టుగా, ఉల్లాసంగా జరుపుకోవడం అభినందనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.

నవంబర్ చివరి వారంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

నవంబర్ నెలాఖరులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అయితే దీనిపై తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రస్తుతానికి ఎలాంటి తుపాను హెచ్చరికలు జారీ చేయలేదని వాతావరణ నిపుణులు స్పష్టం చేశారు. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధిపతి పి.ఎల్.ఎన్. మూర్తి తెలిపిన వివరాల ప్రకారం... నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 మధ్య కాలంలో దక్షిణ అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడవచ్చు. ఇది క్రమంగా బలపడి అల్పపీడనంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందా లేదా అనే అంశంపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. ఒకవేళ బలపడినా కూడా, అది శ్రీలంక లేదా తమిళనాడు తీరం వైపు పయనించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ఆంధ్రప్రదేశ్ వైపు వస్తుందని చెప్పలేమని ఆయన వివరించారు. దీని తీవ్రత, ప్రయాణించే మార్గానికి సంబంధించి ఐఎండీ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని తెలిపారు. సాధారణంగా ఉపరితల ఆవర్తనం అనేది వాతావరణ వ్యవస్థలలో అత్యంత ప్రాథమిక దశ మాత్రమేనని, ఇలా ఏర్పడే ప్రతి ఆవర్తనం తుపానుగా మారదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నవంబర్ 27 తర్వాత అల్పపీడనం ఏర్పడిన అనంతరమే దీని తదుపరి కదలికలపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది. మరోవైపు, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో కురుస్తున్న వర్షాలకు, నెలాఖరులో రాబోయే ఆవర్తనానికి ఎలాంటి సంబంధం లేదని ఐఎండీ స్పష్టం చేసింది. తూర్పు గాలుల (ఈస్టర్లీ వేవ్స్) ప్రభావంతో వచ్చే కొద్దిరోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో నవంబర్ 22 నుంచి 28 వరకు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా నవంబర్ 23 నుంచి 26 మధ్య ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయి. తమిళనాడు, పుదుచ్చేరిలలో నవంబర్ 23 నుంచి 27 వరకు భారీ వర్షాలు, కేరళలో నవంబర్ 24 నుంచి 26 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు పడవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో రాగల రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ తీరానికి ప్రస్తుతం ఎలాంటి తుపాను ముప్పు లేదా రెడ్ అలర్ట్ లేదని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు విడుదల చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆ దాత ఎవరు?



(మొదటి పేజీ తరువాయి)

విరాళం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్. ఇప్పుడు దీని పైనే సర్వత్రా చర్చ నడుస్తోంది. సేవా తత్పరత కలిగిన ఆ భక్తుడు ఎవరు అనేది ఇప్పుడు ప్రశ్న. అయితే సదరు భక్తుడు ఒక ప్రముఖ స్టార్టప్ సంస్థ వ్యవస్థాపకుడు అని.. ఇటీవల తన కంపెనీలోని కొంత వాటాను విక్రయించగా వేలకోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని తెలుస్తోంది. తనకు లభించిన ఈ అపారమైన సంపదకు కృతజ్ఞతగా.. శ్రీవారి నిత్య పూజలు, సేవల్లో వినియోగించే అత్యంత విలువైన స్వర్ణాభరణాలను స్వయంగా చేయించి.. స్వామివారికి సమర్పించాలని ఆయన సంకల్పించారు. ఈ విరాళం విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుంది. సుమారు 120 కేజీలకు పైగా బంగారంతో అత్యంత సుందరంగా ఈ ఆభరణాలను తయారు చేయించారు..

వేల కోట్ల ఆదాయం రావడంతో..

అయితే ఈ భక్తుడి భారీ విరాళం పై అప్పుడే ప్రచారం మొదలైంది. గతంలోనే ఒకసారి సీఎం చంద్రబాబు ప్రకటన కూడా చేశారు. పరోక్షంగా ప్రస్తావించారు. తన సంస్థ వాటా అమ్మకం ద్వారా వేలకోట్లు సంపాదించిన ఒక యువ పారిశ్రామికవేత్త, శ్రీవారికి నిత్య పూజలకు వాడే సమస్త బంగారు ఆభరణాలను చేయించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని చంద్రబాబు వెల్లడించారు. కేవలం దైవ భక్తితోనే ఈ కైంకర్యం చేస్తున్నానని.. తనకు ఎలాంటి పబ్లిసిటీ లేదా గుర్తింపు అక్కర్లేదని సదరు భక్తుడు స్పష్టంగా కోరుకున్నట్లు తెలుస్తోంది. అందుకే తన పేరు ఎక్కడా బయటకు రాకుండా.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ బంగారు కానుకలను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అప్పగించేలా ఏర్పాట్లు జరిగాయి.

కొన్ని నిబంధనలు..

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఒక అనవాయితీ కొనసాగుతూ వస్తోంది. తిరుమల శ్రీవారికి భారీగా విరాళాలు ఇచ్చే దాతల పేర్లను టీటీడీ అధికారికంగా ప్రకటిస్తుంది. వారికి ప్రత్యేక దర్శనాలు, సన్మానాలు వంటి ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పిస్తుంది. కానీ నిజమైన భక్తి భావంతో కుడిచేత్తో ఇచ్చేది ఎడమ చేతికి తెలియకూడదు అనుకునే దాతలు కోసం టీటీడీ నిబంధనల్లో ప్రత్యేక వెసులుబాటు ఉంది. విరాళం ఇచ్చే భక్తులు తమ వివరాలు బయటకు రాకూడదని కోరుకుంటే.. టీటీడీ వారి పేర్లను పూర్తిగా గోప్యంగా ఉంచుతుంది. ఇదే నిబంధనను అనుసరించి.. స్టార్టప్ కంపెనీ యజమాని తన పేరును రహస్యంగా ఉంచుతూ శ్రీవారి సేవలో తరిస్తున్నట్లు తెలుస్తోంది.భారీ విరాళం ఇచ్చే భక్తుడు అజ్ఞాతంగా ఉండాలని కోరుకుంటూ టీటీడీ పబ్లిక్ రిలేషన్స్ విభాగం ఆ విరాళానికి సంబంధించి పత్రికా ప్రకటనల్లో దాత పేరు, ఊరు లేదా ఫోటోలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల చేయదు. కేవలం ఒక అజ్ఞాత భక్తుడు అని మాత్రమే పేర్కొంటుంది. లక్ష రూపాయల నుంచి కోటి రూపాయలు.. అంతకంటే పెద్ద మొత్తం ఎక్కువ విరాళం ఇచ్చే దాతలకు టీటీడీ ప్రత్యేక దర్శనాలు, వసతి, బహుమానాలు ఇస్తుంది. అయితే అజ్ఞాతదాతగా విరాళం ఇచ్చేవారు ఈ ప్రోటోకాల్ సదుపాయాలను స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుంది. అయితే దాత పేరును ప్రజలకు, మీడియాకు గోప్యంగా ఉంచినప్పటికీ.. భారత ప్రభుత్వ ఆదాయపు పన్ను, మనీ లాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం 50 వేల రూపాయల కంటే ఎక్కువ విరాళం ఇచ్చేటప్పుడు.. టీటీడీ రికార్డుల కోసం దాత పాన్ కార్డు లేదా ఆధార్ వివరాలు తప్పనిసరి. ఈ వివరాలు కేవలం టిటిడి ఆడిట్, ఆదాయపు పన్ను శాఖ అవసరాల కోసం అత్యంత భద్రంగా ఉంచుతారు. బయటకు వెల్లడించరు.

'మంగళగిరి- తాడేపల్లి' కార్పొరేషన్ ఎవరిది?



(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికల్లో ఈసారి మేయర్ పీఠానికి నేరుగా ప్రజలు ఓటు వేసే విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలను మార్చేసింది. ఎస్ టి కేటగిరికి రిజర్వ్ అయిన మేయర్ స్థానానికి మంత్రి నారా లోకేష్ ఒక సామాన్య పార్టీ కార్యకర్త పేరం ఏడుకొండలను టిడిపి అభ్యర్థిగా ప్రకటించారు. మరోవైపు వైసీపీ తరపున కేతవత్ పూర్ణ నాయక్ బరిలో నిలిచారు. క్షేత్రస్థాయి వాతావరణం మాత్రం అధికార కూటమి వైపు మొగ్గు చూపుతోంది.

కంచుకోట గా మారి..

మంగళగిరి అంటేనే కంచుకోటగా మార్చుకున్నారు లోకేష్. అక్కడి ప్రజలకు ఆత్మబంధువుగా మారిపోయారు. ప్రత్యక్ష మేయర్ ఎన్నిక కావడంతో కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లో ఓటర్లంతా నేరుగా మేయర్ అభ్యర్థికి ఓటు వేయాల్సి ఉంటుంది. ఇది తెలుగుదేశం పార్టీకి కలిసి వచ్చే అంశం. స్థానిక డివిజన్ స్థాయిలో ఉండే చిన్నపాటి స్థానిక సమస్యలు, గ్రూపు తగాదాలకు అతీతంగా మేయర్ ఓటు విషయానికి వచ్చేసరికి ఓటర్లు ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, స్థానిక ఎమ్మెల్యే లోకేష్ నాయకత్వం, రాజధాని అమరావతి అభివృద్ధిని ప్రామాణికంగా తీసుకుంటున్నారు. కార్పొరేటర్ ఓటు ఎవరికి వేసినా, మేయర్ ఓటు మాత్రం సైకిల్ గుర్తుకే వేయాలని బలమైన సెంటిమెంట్ పట్టణ, శివారు ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

వెనుకబడిన వర్గాలు ఉన్నచోట..

వాస్తవానికి మంగళగిరి పట్టణంలో చేనేత సామాజిక వర్గం అధికం. తాడేపల్లి పరిధిలో మధ్యతరగతి, ఉద్యోగ, వ్యాపార వర్గాలు నివసించే డివిజన్లలో కూటమి పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నారా లోకేష్ ఇక్కడి నుంచి సుమారు 91 వేల పైచిలుకు రికార్డు మెజారిటీతో గెలుపొందారు. అటు తరువాత నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పేదలకు శాశ్వత ఎల్లపట్టాల పంపిణీ వంటి కార్యక్రమాలు టిడిపికి తిరుగులేని అస్త్రాలుగా మారాయి. జనసేనతో పాటు బిజెపి శ్రేణులు కూడా పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేస్తుండడం కూటమికి కలిసి వచ్చే అవకాశం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సమన్వయంలో పించింది. జగన్మోహన్ రెడ్డి నివాసం ఉన్న తాడేపల్లి ప్రాంతంలోని ఆ పార్టీ క్యాడర్ తీవ్ర నైరాశ్యంలో కురుకుపోయింది. గత ఐదేళ్ల పాలనలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని అసంతృప్తి ప్రజల్లో బలంగా ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారానికి వెళ్లిన చోట వ్యతిరేకత కనిపిస్తోంది. డివిజన్లలో పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థులు దొరకడం లేదు. ఉన్న నేతలు కూడా ఆర్థికంగా ఖర్చు చేసేందుకు ముందుకు రావడం లేదు. కేవలం ఎన్టి, మైనారిటీ ఓట్లపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశలు పెట్టుకుంది. అయితే క్షేత్రస్థాయిలో కూటమి వ్యూహాల ముందు అవి అంత మాత్రం పనిచేయడం లేదు. ఏకపక్ష ఓటింగ్ పైనే కూటమి దృష్టి పెట్టింది. ఉనికి చాటుకునేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది.



గోదావరి పుష్కరాలకు ప్రధాని మోదీ!

మరోవైపు గోదావరి పుష్కరాలకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రధాని మోదీ రానున్న దృష్ట్యా ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నమో గోదావరి పేరుతో వినూత్న కార్యక్రమాలు కూడా చేపట్టాలని ఆదేశించడం విశేషం.

ఏడాది కిందటి నుంచి కార్యాచరణ..: గోదావరి పుష్కరాలను ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏడాది కిందట నుంచి ఏర్పాట్లు మొదలు పెట్టింది. గత అనుభవాల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచమంతా ఏపీ వైపు చూసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వం సైతం తన వంతు సహాయం అందిస్తోంది. అయితే ఈ వేడుకలకు ప్రధాని నరేంద్ర మోడీని ప్రత్యేకంగా ఆహ్వానించారు సీఎం చంద్రబాబు. దీంతో ప్రధాని వచ్చేందుకు సుముఖత చూపారు. ప్రధానితో పాటు కేంద్ర మంత్రులంతా ఏపీకి రానున్నారు. అందుకే సీఎం చంద్రబాబు అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. నమో గోదావరి పేరుతో భారీగా కార్యక్రమాలు చేపట్టాలని కూడా ఆదేశించారు. గోదావరి పుష్కరాలు అంటే 12 రోజులు మాత్రమే కాదు.. ఏడాది పాటు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించాలని ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సీఎం అధికారుల సమీక్షలో ఆదేశించారు. కేవలం ఆధ్యాత్మికంగానే కాదు పర్యాటకంగానూ గోదావరి పుష్కరాలు దోహదపడాలని కూడా చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.

400 ఘాట్లలో స్నానాలు... : గోదావరి తీరంలో దాదాపు 400 ఘాట్లలో స్నానాలు ఆచరించే వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు నాలుగువేల కోట్ల రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. మరోవైపు భారత రైల్వే శాఖ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాజమండ్రి రైల్వే స్టేషన్ ను అభివృద్ధి చేసింది. దేశం నలుమూలల నుంచి, అన్ని రాష్ట్రాల నుంచి 1560 రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఏపీఎస్ఆర్టీసీతో పాటు అన్ని రాష్ట్రాల రవాణా కార్పొరేషన్లు, ప్రైవేటు వాహనాలకు సంబంధించిన నాలుగు వేల ప్రత్యేక బస్సులు కూడా నడవనున్నాయి. మొత్తానికైతే ప్రధాని గోదావరి పుష్కరాలకు మరింత శోభ రానుంది. కేంద్ర ప్రభుత్వం సైతం.. ఈ గోదావరి మహా పండుగకు తమ వంతు సాయం అందించనుంది.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 15 లోక్‌సభ సీట్లు గెలుచుకుని, రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేసే బాధ్యతను తెలంగాణ కాంగ్రెస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన టీపీసీసీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ, సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 92,35,833 ఓట్లు సాధించి 64 స్థానాలు గెలుచుకుందని, మిత్రపక్షమైన సీపీఐ ఒక స్థానం దక్కించుకుందని సీఎం గుర్తుచేశారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు వరుసగా రెండు పర్యాయాలు గెలిచినట్లే, కాంగ్రెస్ కూడా మళ్లీ గెలిచి పదేళ్ల పాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. 2024 ఎన్నికలకు ముందే బీజేపీ 240 సీట్లకు మించి గెలవదని తాను చెప్పిన విషయం నిజమైందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇదే సమయంలో పార్టీ నాయకులకు కూడా ఆయన స్పష్టమైన హెచ్చరిక చేశారు.



ప్రభుత్వంపై బహిరంగంగా నెగెటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, ఎవరు ఏం మాట్లాడుతున్నారో పార్టీ వద్ద పూర్తి సమాచారం ఉందని తెలిపారు. పార్టీ లైన్‌లో నడిచే వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని చెప్పారు. సంక్రాంతి పండుగ తర్వాత ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లనుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దీని ఆధారంగానే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే కేంద్రానికి లేఖ రాశారని ఆయన వివరించారు.

వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ గా

భారతి రెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

షెడ్యూల్ కూడా సిద్ధం చేశారు. అయితే ఈ రెండేళ్ల పాటు పార్టీ రాష్ట్ర బాధ్యతలు, తాడేపల్లి కేంద్ర కార్యాలయం నిర్వహణ బాధ్యతలు వైయస్ భారతీ రెడ్డికి అప్పగిస్తారని తెలుస్తోంది. అవసరం అనుకుంటే ఆమెకు పార్టీ రాష్ట్ర పగ్గాలు ఇచ్చేందుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

అత్యంత క్లిష్ట సమయం..

ఇప్పటివరకు తెర వెనుక వైయస్ భారతి రెడ్డి సేవలందిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా సేవలందించాల్సిన అవసరం ఏర్పడింది. పార్టీ కష్టకాలంలో ఉంది. సీనియర్ నేతలు ఒక్కొక్కరు పార్టీకి దూరమయ్యారు. ఇటువంటి సమయంలో జగన్మోహన్ రెడ్డి ఇతరులకు పార్టీని అప్పగించేందుకు ఇష్టపడడం లేదు. సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు కానీ ఆయనపై ఒక రకమైన విమర్శలు ఉన్నాయి.. అందుకే సొంత వారిని రంగంలోకి దించి పార్టీ బాధ్యతలు అప్పగించాలని జగన్ భావిస్తున్నారు. అందుకు సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ పూర్తయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సాక్షి మీడియా బాధ్యతను చూస్తున్నారు భారతీ రెడ్డి. ఇప్పుడు పార్టీ బాధ్యతలను కూడా చూడనున్నారు. పార్టీ అధినేతగా జగన్మోహన్ రెడ్డి ఉంటారు. వర్కింగ్ ప్రెసిడెంట్గా భారతీ రెడ్డి బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

పార్టీని నడిపేందుకు..

వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. దాదాపు రెండు సంవత్సరాలపాటు ప్రజల మధ్య ఉండేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ఆ సమయంలో పార్టీని సమన్వయం చేసుకునేవారు ఇప్పుడు అవసరం. సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్న ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. మరోవైపు తల్లి విజయమ్మతో పాటు చెల్లెలు షర్మిల ఇప్పటికే దూరమయ్యారు. షర్మిల రాజకీయంగా కూడా విభేదిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భారతీ రెడ్డిని రంగంలోకి దించి.. పార్టీ బాధ్యతలు అప్పగించేందుకు జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి మరి అందులో ఎంతవరకు వాస్తవం ఉందో.



పాటు నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయని అంచనా వేస్తోంది. ముఖ్యంగా తెలంగాణ పై ఫుల్ ఫోకస్ చేసింది బిజెపి. అక్కడ ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తోంది. అందుకే 2029 సార్వత్రిక ఎన్నికలతో పాటు ఇక్కడ ఎన్నికలు నిర్వహిస్తే మంచి ఫలితం వచ్చే అవకాశం ఉంది. ఓ ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించి తన మార్కు చూపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్రపతి పాలన..

తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటోంది భారతీయ జనతా పార్టీ. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో పరిస్థితి కనిపించడం లేదు. దీంతో బిజెపి అగ్ర నాయకత్వంలో ఒక రకమైన పునరాలోచన. అందుకే ముందుగా రాష్ట్రపతి పాలన విధించి.. 2029 సార్వత్రిక ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తే సత్ఫలితాలు వస్తాయని బిజెపి అగ్ర నేతలు భావిస్తున్నారు. ఈ లోపు పార్టీలో చేరికలతో పాటు బలోపేతానికి కూడా ఒక మార్గం దొరుకుతుంది. అందుకే బిజెపి అగ్ర నేతలు తెలంగాణలో ఆరు నెలలపాటు ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. బిజెపిలో విభేదాలు తొలగించడం, ప్రజల మధ్యకు వెళ్లడం, ప్రత్యేక అభివృద్ధి బాట పట్టడం వంటి వాటితో కేంద్రం తెలంగాణ ప్రజలకు మరింత దగ్గర కావాలని చూస్తోంది. ఈ ప్రయత్నాలన్నీ చూస్తుంటే తెలంగాణలో కనీసం 6 నెలల పాటు అసెంబ్లీ ఎన్నికలు వాయిదా పడే అవకాశం కనిపిస్తోంది. చూడాలి చివరకు ఏం జరుగుతుందో..



వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లాలోని బుగ్గ రామేశ్వరం వద్ద వేగంగా వచ్చిన ఓ లారీ, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నగేష్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న చంద్రమ్మ, పార్వతమ్మ, సరిత అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారని, పెండ్లిముడుగు గ్రామం నుంచి పనుల నిమిత్తం కేరెళ్లికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. మలుపు వద్ద లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సంతోష్ గౌడ్ వివాహ వేడుకకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

గండిపేట,(క్రైమ్ మిర్రర్) నార్సింగి సర్కిల్ పరిధివట్టినాగులపల్లిలోని ఇవెంటారా కన్వెన్షన్‌లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుడు సంతోష్ గౌడ్ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

కుటుంబంలో అందరికీ వర్తింపచెయ్యాలి : పాగర్తి సుధాకర్



క్రైమ్ మిర్రర్ ఖమ్మం : ఇందిరమ్మ జీవిత భీమా పథకం ఎలాంటి షరతులు లేకుండా కుటుంబంలో ప్రతి ఒక్కరికీ కల్పించాలని పత్రికా విలేకర్ల సమావేశం లో బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ ఈ భీమా పథకం వయస్సు, బ్యాంక్ అకౌంట్ లతో సంబంధం లేకుండా ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు, కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడం సరికాదని అని అన్నారు, అంతేకాక సమయం తక్కువ ఉన్నందున సమయం పెంచాలని కోరారు , ఈ సమావేశంలో నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, దారావత్ వీరు నాయక్,తేజావత్ మల్లికార్జున, బానోతు శ్రీనివాసరావు, ఏపూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

తుక్కుగూడ సమీపంలో 'మ్యాక్ ఫెర్న్' లగ్జరీ గేటెడ్ విల్లా ప్రాజెక్ట్ ప్రారంభం...!

15 ఎకరాల్లో 109 ప్రీమియం విల్లాల నిర్మాణం..!
మ్యాక్ ఫెర్న్ తో కొత్త జీవన శైలి డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్...!





మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): రంగారెడ్డి జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శ్రీశైలం హైవే కారిడార్ వెంబడి తుక్కుగూడ, మహేశ్వరం సమీపంలో రేరా ఆమోదం పొందిన లగ్జరీ గేటెడ్ విల్లా కమ్యూనిటీ 'మ్యాక్ ఫెర్న్' ను మ్యాక్ ప్రాజెక్ట్స్ ప్రారంభించింది. ఈ సందర్భంగా మ్యాక్ ప్రాజెక్ట్స్ ఎండీ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ... ఆరోగ్యమే అసలైన విలాసం. స్వచ్ఛమైన గాలి, సూర్యరశ్మి, విశాలమైన బహిరంగ ప్రదేశాలతో కూడిన ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడమే మా లక్ష్యం. 20 ఏళ్ల క్రితమే మహేశ్వరంలో 'బీటీఆర్ గ్రీన్స్' తో విల్లాల అభివృద్ధికి నాంది పలికాం" అని తెలిపారు. 15 ఎకరాల్లో 109 బొటిక్ జీ+2 విల్లాలతో ఈ ప్రాజెక్ట్ ను రూపొందించారు. 312 నుంచి 427 గజాల ప్లాట్లలో సుమారు 4,525 చ.అడుగుల 4 BHK G హోమ్ థియేటర్ విల్లాలు ఉంటాయి. ఇంపోర్టెడ్ మార్బుల్ ఫ్లోరింగ్, వెట్, డ్రై కిచెన్ లు, 40 అడుగుల వెడల్పు రోడ్లు ప్రత్యేక ఆకర్షణ. 30,000 చ.అడుగుల క్లబ్ హౌస్ లో స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్, స్క్వాష్, ఫిట్ నెస్ స్టూడియో, లైబ్రరీ, కేఫ్, గెస్ట్ సూట్లు ఉంటాయి. పికిల్ బాల్, బాక్స్ క్రికెట్, యాంఫిథియేటర్, పిల్లల ఆట స్థలాలతో పాటు T RFID, CCTV, సోలార్ ఫెన్సింగ్ తో 24/7 భద్రత ఉంటుంది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 తుక్కుగూడ నుంచి కేవలం 5 నిమిషాల దూరంలో, తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్ పక్కన ఈ ప్రాజెక్ట్ ఉంది. విమానాశ్రయం, భారత్ ఫ్యూచర్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ, ఫ్యాబ్ సిటీలకు సులభ కనెక్టివిటీ ఉంది. ప్రస్తుతం 109 విల్లాల 'ఫెర్న్ విల్లాస్', 38 విల్లాల 'రోజ్ వుడ్ విల్లాస్ బై మ్యాక్ ప్రైమ్' నిర్మాణంలో ఉన్నాయని, 2027లో మరో రెండు ప్రాజెక్టులు చేపడతామని డాక్టర్ ఖాన్ తెలిపారు. మరింత సమాచారం కోసం 99591 54371 / 99639 80259లిలను సంప్రదించాలని తెలిపారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన కమాన్ పూర్

ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్

పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ న్యూస్: స్థానిక మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెల్లి శ్రీనివాస్-సత్య కుమారుడు ఆరెల్లి భగత్-సంగీత వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన దాంపత్య జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన వధూవరులను ఆశీర్వదించిన యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మహమ్మద్ యూసుఫ్,మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్యాల మహేష్ గౌడ్,వార్డ్ సభ్యులు తూటి రాజు,నాయకులు మంథని మహేష్,గురునాథం హరికృష్ణ,చిప్పకుర్తి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు శుభాకాంక్షలు తెలిపారు

రెండు చుక్కలతో చిన్నారులకు రక్షణ కవచం...!

రావిర్యాలలో విజయవంతంగా పల్స్ పోలియో డ్రైవ్

5 సెంటర్లలో 1578 మంది చిన్నారులకు చుక్కలు..



మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్): ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా తుక్కుగూడ వార్డు పరిధిలోని రావిర్యాలలో గ్రామంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. రావిర్యాలలో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక సెంటర్లలో మొత్తం 1578 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి డా. తేజ తెలిపారు. ఉదయం నుంచే సెంటర్ల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలతో క్యూ కట్టారు. ఈ సందర్భంగా డా. స్వరూప, డా. తేజ మాట్లాడుతూ.. పోలియో చుక్కలు వేసుకోవడం ఒక్కసారితో సరిపోదన్నారు. గతంలో వేసుకున్న వారు కూడా మళ్లీ తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఒక్క నిర్లక్ష్యం పిల్లల భవిష్యత్తుకే ప్రమాదమని హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ఆశా వర్కర్లు ఎన్. దివ్య, టి. రాధిక, జె. జయమ్మ, ఆర్. శోభ, బి. లావణ్య, ఎస్.కె. బాను బేగం కీలక పాత్ర పోషించారు. చిన్నారులకు చుక్కలు వేసి, వేలికి సిరా మార్క్ వేసి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆదివారం మిస్ అయిన చిన్నారుల కోసం నవంబర్ 23, 24 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో నవంబర్ 25న కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో రావిరాలలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది.

పెట్టుబడులు, ఉద్యోగాలపై చర్చకు సిద్ధమా?: జగన్‌కు మంత్రి నారా లోకేశ్ సవాల్

కూటమి ప్రభుత్వంలో గ్లోబల్ బ్రాండ్లు భారీ పెట్టుబడులు పెట్టాయని వెల్లడి

గూగుల్, రిలయన్స్, బ్లాక్‌ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థల ప్రాజెక్టుల వివరాలు ప్రస్తావన

గతంలో ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేశారంటూ లోకేశ్ ఆరోపణ

రాష్ట్ర అభివృద్ధిపై చర్చకు రావాలంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ మరియు ఉద్యోగాల కల్పన అంశాలపై వైసీపీ అధినే జగన్ కు రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బహిరంగ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ, జాతీయ స్థాయి అగ్రశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత భవిష్యత్తు కోసం పరిశ్రమలను రప్పించే ప్రయత్నం చేస్తుంటే, గత పాలకులు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి న్యాయస్థానాల్లో పిటిషన్లు వేశారని, ఆ తర్వాత మళ్లీ ప్రాజెక్టుల క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా 2024-26 కాలానికి సంబంధించిన పారిశ్రామిక ప్రగతి వివరాలను మంత్రి పంచుకున్నారు. అందులో గూగుల్ (రూ. 1,33,000 కోట్లు), ఏఎం/ఎన్ఎస్ ఇండియా (రూ. 1,36,000 కోట్లు), బ్లాక్‌ఫీల్డ్ (రూ. 1,06,000 కోట్లు), రిలయన్స్ (రూ. 43,000 కోట్లు), రెన్యూ, వారీ, ప్రీమియర్ ఎనర్జీస్, అల్ట్రాటెక్, దాల్మియా భారత్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ, టాటా, ఐబీఎం, కాగ్నిజెంట్ తదితర సంస్థల ప్రాజెక్టులు వివిధ దశల్లో (కమిషన్డ్, నిర్మాణంలో, ఆపరేషనల్) ఉన్నట్లు ఆ జాబితాలో చూపించారు. ఈ వివరాలను ప్రస్తావిస్తూ.. "ఇది మా ట్రాక్ రికార్డ్. పరిశ్రమల పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన మరియు రాష్ట్ర అభివృద్ధిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. నా సవాల్‌ను స్వీకరించడానికి మీరు సిద్ధమేనా?" అంటూ జగన్‌ను ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
4 సోమవారం 23-11-2026



బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతలకు ట్రోఫీల ప్రదానం

ఎస్ఎల్వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్గత టోర్నమెంట్



కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎల్వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నల్ మెంబర్‌షిప్ టోర్నమెంట్--2026 ఉత్సాహభరితంగా జరిగింది. ఈ టోర్నీలో ప్రతిభ కనబరిచిన విజేతలు, రన్నరప్‌లకు ముఖ్య అతిథి రామకృష్ణ ట్రోఫీలను అందజేసి అభినందించారు. పురుషుల విభాగంలో రమేష్, అనిల్ జోడీ మొదటి స్థానం సాధించగా, ప్రవీణ్, వి. శ్రీరాములు జోడీ ద్వితీయ స్థానంలో నిలిచారు. అఖిలేశ్వర రెడ్డి, హర్షిత్.డి జోడీ మూడో స్థానం సాధించగా, హరీష్, చి. యశ్వంత్ జోడీ నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు.మహిళల విభాగంలో మంజుష, అనూష జోడీ మొదటి స్థానం కైవసం చేసుకోగా, కావ్యశ్రీ గుట్ట, భార్గవి గుంటుపల్లి జోడీ రెండో స్థానంలో నిలిచారు.ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ, క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రీడాస్ఫూర్తి, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేసిన రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని అకాడమీ ఆర్గనైజర్ శ్యామ్ నిర్వహించారు. మరిన్ని క్రీడా కార్యక్రమాల ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తామని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం...

పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : 0..5 సంవత్సరాలలోపు పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ శ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం ఆవరణలోని కమిటీ హాల్లో పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పక పోలియూ చుక్కలు వేయించాలంటూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాషియర్ నరసింహులు ముదిరాజ్, టెంపుల్ చైర్మన్ పేర్ని ధర్మారావు, పి శంకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఆశ వర్కర్స్ జ్యోతి, అపర్ణ, శ్రీలత, సబిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు విధిగా తమ పిల్లలకు పోలియో చుక్కలను వేయించాలి

ఫతేనగర్‌లో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్





బాలానగర్, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి చిన్నారికి పోలియో నుంచి రక్షణ కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి రెండు చుక్కల ఓరల్ పోలియో వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని ఆయన అవగాహన కల్పించారు.పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

BC -JAC జిల్లా చైర్మన్, BRS పార్టీ నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ నవంబర్ 22 న్యూస్: యువత కంపెనీలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పించే దిశగా ఎదగాలి ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని శాంతి నగర్ లో గల సింధూర ITI క్యాంపస్‌లో BC -JAC పెద్దపల్లి జిల్లా చైర్మన్, దీ=నా పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ నాయకురాలు దాసరి ఉష సహకారంతో నాబత్తీఎంప్లు Manpower services, Fit and Future Club ఆధ్వర్యంలో ముఖ్యంగా మహిళలకు, యువతులకు ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించుటకై మెగా జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 500 మంది పైచిలుకు నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాల కోసం హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో సుమారు 20 వరకు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 500 మంది యువత ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు.ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ, జాబ్ మేళా కు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు కంపెనీ ప్రతినిధుల వద్ద ఇంటర్వ్యూ ఫేస్ చేసి ఉద్యోగం సాధించి తమ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని అన్నారు.ప్రతి ఇంట్లో ఒకరికి ఉద్యోగం లభించినా ఆ కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని పేర్కొన్నారు. యువత ఉద్యోగాల్లో స్థిరపడితే వారి కుటుంబాలతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే విద్య అత్యంత కీలకమని అన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగం సంపాదించి, ఉద్యోగం చేస్తూ, అనుభవం సంపాదించి ఉద్యోగాలు కల్పించే దిశగా కంపెనీలు ఏర్పాటు చేయాలని ఆకాక్షించారు. యువత ప్రారంభంలో చిన్న ఉద్యోగం వచ్చిందని నిరుత్సాహపడకుండా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి చిన్న ఉద్యోగమే రేపటి గొప్ప భవిష్యత్తుకు పునాది అవుతుందని అన్నారు. ఉద్యోగంలో పొందే అనుభవం, నేర్చుకునే నైపుణ్యాలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగడానికి దోహదపడతాయని వివరించారు. వివిధ రంగాల్లో స్థిరపడి తమ తల్లిదండ్రులకు, పెద్దపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకువస్తున్నారని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతోనే ఈ మెగా జాబ్ మేళాను నిర్వహించినట్లు దాసరి ఉష తెలిపా

ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవ వేడుకలు

ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఐదు దశాబ్దాల సామాజిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని, 50 సం.లు పూర్తి అయిన సందర్భంగా, స్వర్ణోత్సవ వేడుకలు పెద్దపల్లిలో ఘనంగా జరిగాయి.



పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ న్యూస్ నవంబర్ 22వ: అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక చైతన్యానికి సంఘం చేసిన కృషిని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. సంఘం అధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, బొంకూరు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు సమాన హక్కులు, సామాజిక న్యాయం అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఆయన చూపిన విద్య, చైతన్యం, సంఘటిత శక్తి మార్గంలో యువత నడవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి, సామాజిక బాధ్యతతో సమాజ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐదు దశాబ్దాలుగా అంబేద్కర్ ఆశయాల వ్యాప్తికి ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ.. అంబేద్కర్ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం పరిసరాలను మరింత అభివృద్ధి చేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాలు కేవలం సభలు, ప్రసంగాలకే పరిమితం కాకుండా ఆచరణలో ప్రతిబింబించాలని, విద్యా రంగంలో వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సంఘం అర్ధ శతాబ్దపు ప్రస్థానం, సామాజిక ఉద్యమాల్లో పోషించిన పాత్రను పలువురు వక్తలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ అంబేద్కర్ ఆశయాల సాధనకు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ ఆరెపల్లి మోహన్.మామిడిపల్లి బాబు. బొంకూరి మధు. బొంకురి శంకర్. లంక సదయ్య. బొంపెల్లి రామలక్ష్మి.ఆసంపల్లి వాసు, మల్లేష్, పలువురు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫతేనగర్‌లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో

పల్స్ పోలియో కార్యక్రమం

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం ఫతేనగర్‌లో ఉత్సాహంగా సాగింది. ఫతేనగర్ వార్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలియో వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పోలియో చుక్కలు వేయించడం ద్వారా చిన్నారులకు అంగవైకల్యం కలిగించే ప్రమాదకరమైన వ్యాధి నుంచి రక్షణ కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సూరజ్ తివారి, ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే. క్రాంతి ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మద్దూరి రాము, శివాలయం కమిటీ సభ్యుడు మద్దూరి సతీష్‌తో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.





భరత్‌నగర్ కాలనీలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి

కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్‌నగర్ కాలనీలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. నాగిరెడ్డి మాట్లాడుతూ చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలియో వ్యాధి బారిన పడకుండా పిల్లలకు నిర్దిష్ట సమయంలో పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలియో నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చక్కటి ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పరిసర ప్రాంతాల్లోని ఇతర తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, బాబు, నరేష్‌కుమార్, మధు, వెంకటేష్ యాదవ్, సంతోష్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 1వ నేషనల్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్ అవార్డుల ప్రధానోత్సవం

క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం తోపాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందింప చేస్తుంది

టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్





కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆర్గనైజర్, ఫౌండర్ పి. ప్రవీణ్ కుమార్ ఆహ్వానం మేరకు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సునీల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన 1వ నేషనల్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్‌షిప్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కరాటే, కుంగ్ ఫూ వంటి మార్షల్ ఆర్ట్స్ విద్యలు విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, ధైర్యసాహసాలను అలవాటు చేస్తాయని అన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తూ, విజేతలకు అవార్డులు అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రమ్య కృష్ణ, కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ చన్ను పాషా, డివిజన్ అధ్యక్షులు శంకర్, పులి శివకుమార్ గౌడ్, చందర్రావు, షహేన్షా, మస్తాన్ రెడ్డి, తూము సంతోష్, నాగార్జున, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పోలియో చుక్కల కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన బండి రమేష్

కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట్ డివిజన్ పరిధిలోని బస్తీ దవాఖానాలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమానికి బండి రమేష్ హాజరై చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పోలియో వ్యాధి బారిన పడకుండా చిన్నారులకు సకాలంలో పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు తూము సంతోష్, శంకర్, మస్తాన్ రెడ్డి, శివకుమార్ గౌడ్, చందర్రావు, నాగార్జున, షహేన్షా, ఎంసీ డైరెక్టర్ ఇజాజ్, కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ చన్ను పాషా తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలి

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోలియో టీకాలు ఎంతో కీలకం

వెంకటేశ్వర నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి



కూకట్ పల్లి, నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : పోలియో నిర్మూలనే లక్ష్యంగా సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ డే -- 2026లో భాగంగా నేడు పాపిరెడ్డి నగర్ బస్తీలోపల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర నగర్, కూకట్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ఇతర బస్తీ నాయకులతో కలిసి పాపిరెడ్డి నగర్ శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ శివాలయం ఆవరణలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోలియో టీకాలు ఎంతో కీలకమని, ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకులు డాకూరి అక్కిరెడ్డి, మాయ బాల నరసయ్య, ఎడ్ల సంపత్ రెడ్డి, బి వి కే శ్రీకాంత్, ధర్మ వెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి, రాజు, ఆశ వర్కర్లు జ్యోతి, అపర్ణ, శ్రీలత, సరిత, విజయ లక్ష్మి, సబిత తదిరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలకు షిర్డీ సాయిబాబా దేవస్థానం సిద్ధం!

గుండాలలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం.. సాయంత్రం సహస్ర కార్తీక దీపోత్సవం



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :- కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గుండాల మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తిభావంతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, సహస్ర కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ప్రారంభం కానుంది. అనంతరం సాయంత్రం 5:30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో సహస్ర కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నారు. వేలాది దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో నింపేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు కోరారు. ఉదయం 9:30 గంటలకే దేవాలయానికి చేరుకున్న వారికి మాత్రమే వ్రతంలో పాల్గొనే అవకాశం ఉంటుందని, భక్తులు సమయపాలన పాటించి ముందుగానే సిద్ధంగా ఉండాలని సూచించారు. దాతల సహకారంతో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం ట్రస్ట్ గుండాల నిర్వాహకులు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ పవిత్ర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



ఏడేళ్లు గడిచినా చెరిగిపోని గుర్రం యాదగిరి రెడ్డి జ్ఞాపకాలు!

సుద్దాలలో ఘనంగా ఏడవ వర్ధంతి.. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:- కాలం గడిచినా కొందరి జ్ఞాపకాలు చెరిగిపోవు.. మరణించినా ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన వ్యక్తుల సేవలు మరువలేనివి. అలాంటి గుర్రం యాదగిరి రెడ్డి ఏడవ వర్ధంతి సందర్భంగా గుండాల మండలం సుద్దాల గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాదగిరి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, అభిమానులు అంజలి ఘటించారు. ఆయనను స్మరించుకుంటూ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడేళ్లు గడిచినా ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించడం విశేషం. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. హరిచంద్ర, మండల కార్యదర్శి అనంతాల రామచంద్రయ్య, సుద్దాల గ్రామ సర్పంచ్ మహోదయ, మండల సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు బీ. శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు స్వామి, కృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొని గుర్రం యాదగిరి రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

రహదారిపై యువకుల ప్రమాదకర విన్యాసాలు

నంబర్ ప్లేట్‌కు మాస్క్ కట్టి బైక్‌పై విచ్చలవిడిగా దూసుకెళ్తున్న వైనం

ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



గండిపేట్, (క్రైమ్ మిర్రర్): శివరాంపల్లి నుండి అరంగర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారిపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ తోటి వాహనదారులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రధాన మార్గంలో యువకులు అతివేగంగా బైక్‌లు నడుపుతూ రోడ్డుపై ఇష్టానుసారంగా విన్యాసాలు చేస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బైక్ వెనుక భాగంలోని నంబర్ ప్లేట్ ఇతరులకు కనిపించకుండా మాస్క్ కట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీసుల నిఘా కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకే కొందరు యువకులు ఈ విధంగా నంబర్ ప్లేట్లను కప్పి ఉంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రహదారిపై ఇతర వాహనదారులు,పాదచారులు ప్రయాణిస్తున్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా ప్రమాదకరంగా బైక్‌లు నడపడం వల్ల ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందని వాహనదారులు పేర్కొంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలను బేఖాతరు చేస్తూ బహిరంగ రహదారులపై ఇలాంటి విన్యాసాలు చేయడం వల్ల అమాయకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంబర్ ప్లేట్లను ఉద్దేశపూర్వకంగా కప్పి ఉంచే వాహనాలను గుర్తించి సంబంధిత యువకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులను సంప్రదించగా ఇలాంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రహదారులపై నిఘా పెంచి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా ఉట్ల రవి నియామకం!

రైతుల అభివృద్ధికి కృషి చేస్తా.. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదగిరి గౌడ్‌కు కృతజ్ఞతలు



క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :- యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఉట్ల రవికి కీలక బాధ్యత దక్కింది. ఆలేరు డివిజన్ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ నియామకంతో బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఉట్ల రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరి గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. రైతులకు ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సాగులో ఆధునిక విధానాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఉట్ల రవి స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 సోమవారం 23-11-2026



వైభవంగా శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల మహోత్సవం

మహోత్సవంలో పాల్గొన్న కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్



క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయంలో బోనాల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు పాలకుర్ల యాదయ్య గౌడ్, దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ఘనంగా బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకలకు రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, బోనాల ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవంలో స్థానిక అయ్యప్ప స్వాములు, గౌడ సంఘం నాయకులు, కుల బంధువులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సర్వేల్ గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం

విద్యార్థులకు వైద్య పరీక్షలు -- 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్





క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.అదేవిధంగా పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉన్నత విద్య, భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన కోర్సులు, వివిధ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు విశిష్ట అతిథులు పాల్గొన్నారు. అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి పురుషోత్తం రెడ్డి, సీనియర్ సభ్యులు చిన్న రాజా, రాజశేఖర్ రెడ్డి, బద్రి వేణుగోపాల్, సతీష్, కరుణాసాగర్, అంబేద్కర్ డేగా, గంగాధర్ తదితరులు, వైద్యులు కోటిరెడ్డి, విజయానంద్, యాదగిరి, సతీష్ రెడ్డి విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. కామినేని మరియు సదురం దంత, కంటి వైద్య నిపుణులు కూడా ఈ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వారి భవిష్యత్తుకు సరైన మార్గదర్శకత్వం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, ప్రస్తుత విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.వైద్య శిబిరం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై విస్తృత అవగాహన

పేద కుటుంబాలు బీమా పథకంలో నమోదు చేసుకోవాలి

మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరి ఆర్థిక స్వావలంబన సాధించాలి



గండిపేట్, (క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ సర్కిల్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ గ్రామంలో ఆదివారం పురపాలక శాఖ ప్రధాన కార్యాలయ పట్టణ సామాజిక అభివృద్ధి విభాగం అదనపు కమిషనర్ అనిత గ్రేస్ పర్యటించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆమె స్థానిక మహిళలు,ప్రజలతో సమావేశమై పథకం ఉద్దేశాలు,ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రతి పేద కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో అర్హులైన కుటుంబాల సభ్యులు తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా బీమా రక్షణ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. పథకానికి సంబంధించిన వివరాలను ప్రజలు పూర్తిగా తెలుసుకొని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి స్వయం సహాయక సంఘాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో చేరి పొదుపు అలవాటును పెంపొందించుకోవడంతో పాటు సంఘాల ద్వారా అందుబాటులో ఉండే వివిధ ఆర్థిక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగినప్పుడే కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారందరికీ వాటి ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అధికారి యుగంధర్ రెడ్డి,సామాజిక సమన్వయకర్త విజేందర్, సి ఓ విజేందర్, రిసోర్స్ పర్సన్లు,స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారంలో డీఎం నిర్లక్ష్య వైఖరి

హయత్‌నగర్ టూ డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ గేట్ ధర్నా



క్రైమ్ మిర్రర్ హయత్‌నగర్ :- హయత్‌నగర్ టూ డిపోలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు ఎస్. సోమయ్య ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. సోమయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల డీఎం మొండి వైఖరి ప్రదర్శిస్తూ పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని, వెంటనే సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు మస్టర్‌లో మూడు లీవులు ఇవ్వాలని, బుకింగ్‌లో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, చాట్‌లో ఎల్ఎస్ఏ డిస్‌ప్లే చేసి చూపించాలని కోరారు. ఒక్కరోజు ఎల్ఆర్ వచ్చిన కార్మికుడికి సెకండ్ సేఫ్టీలో డ్యూటీ వేసి కౌన్సెలింగ్, చార్జిషీట్ ఇవ్వకూడదని, ఎర్నింగ్‌పై ప్రతిరోజూ నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. ఈవీ డ్రైవర్లు అందుబాటులో లేకపోతే కండక్టర్లకు మాస్టర్ ఇవ్వాలని, అన్ని రూట్లలో సర్వే నిర్వహించి కిలోమీటర్లను తగ్గించి ఏడున్నర గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. బోరబండ స్పెషల్ ఆఫ్ డ్యూటీలను ఒకే డ్రైవర్‌కు కేటాయించాలని, పొజిషన్లకు సరిపడా కండక్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ఈ గేట్ ధర్నాలో డిపో సెక్రటరీ వీ. రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జీ.వి. కుమార్, కోశాధికారి వై.వి.ఎం. కుమార్, వైస్ ప్రెసిడెంట్ కే. అశోక్, చీఫ్ అడ్వైజర్ శ్రవణ్ కుమార్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ ఏ.యు.ఎం. ఝాన్సీ, జోనల్ జాయింట్ సెక్రటరీ రమాదేవి, సీనియర్ నాయకుడు బి. జగన్, స్టేట్ కమిటీ సభ్యుడు పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు చేశారనే కక్షతో మహిళ దారుణ హత్య

రూ.45 వేల నగదు బదిలీ వ్యవహారమే హత్యకు కారణం





క్రైమ్ మిర్రర్ చేవెళ్ల, నవంబర్ 22: పోలీసులకు ఫిర్యాదు చేశారనే కక్షతో ఓ యువకుడు మహిళను కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన ఘటన చేవెళ్లలో కలకలం రేపింది. ఈ హత్య కేసును చేవెళ్ల పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు చోరీ చేసిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల ఇంటి సమీపంలో బత్తుల పద్మ అనే మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వెలుగోడు గ్రామం, మండలంలోని జమ్మి నగర్‌కు చెందిన కేతావత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ అలియాస్ శివ (19) ఈ హత్యకు పాల్పడ్డాడు.ఈ నెల 20వ తేదీన బత్తుల గురువులుకు చెందిన మొబైల్ ఫోన్‌ను నిందితుడు శివ దొంగిలించాడు. అనంతరం ఆ మొబైల్ ఫోన్ ద్వారా గురువులు బ్యాంకు ఖాతా నుంచి రూ. 45 వేల నగదును మరో ఖాతాకు బదిలీ చేశాడు. తన మొబైల్ ఫోన్ చోరీ కావడం, బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ కావడంతో గురువులు నిందితుడిపై అనుమానం వ్యక్తం చేశాడు. ఈ విషయమై తన భార్య బత్తుల పద్మతో కలిసి నవంబర్ 21వ తేదీన చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారనే విషయాన్ని జీర్ణించుకోలేని నిందితుడు శివ పద్మపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆమెపై కత్తితో దాడి చేసి హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం నెలకొంది.

24 గంటల్లోనే నిందితుడి అరెస్ట్

మహిళ హత్యపై కేసు నమోదు చేసిన చేవెళ్ల పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు నేరం జరిగిన 24 గంటల్లోనే అతడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

గతంలోనూ రెండు దొంగతనం కేసులు

నిందితుడు శివపై గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలో మరో రెండు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసుల్లోనూ అతని ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మహిళ హత్య కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు బృందానికి ఇన్‌స్పెక్టర్ అభినందనలు

ఈ హత్య కేసును తక్కువ సమయంలోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంలో సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ వెంకటేష్‌తో పాటు పోలీసు బృందాన్ని చేవెళ్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ

గగన్‌పహాడ్‌లో చుక్కల మందు వేసిన శీలం తిరుపతిరెడ్డి



గండిపేట్, (క్రైమ్ మిర్రర్): చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం గగన్‌పహాడ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు మరియు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 23-11-2026
7

హైతాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం





ట్రేఫోయిల్ ప్యాకింగ్ కంపెనీలో ఎగిసిపడిన మంటలు.. భారీగా ఆస్తి నష్టం

విద్యుత్ కేబుల్స్ వేడెక్కడం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానం

ప్రాణనష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు..

ఫైర్ ఔట్‌పోస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

క్రైమ్ మిర్రర్:షాబాద్: షాబాద్ మండలం హైతాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్కులో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ట్రేఫోయిల్ ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే పెద్ద ఎత్తున వ్యాపించాయి. మంటలు భారీగా ఎగిసిపడటంతో కంపెనీ పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు, కంపెనీ సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఘటనాస్థలానికి చేరుకున్నారు. షాద్‌నగర్, వికారాబాద్, మహేశ్వరం ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. పలుమార్లు నీటిని చల్లుతూ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. చివరకు అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

విద్యుత్ కేబుల్స్ వేడెక్కడం వల్లేనా?

ఘటనపై జిల్లా అగ్నిమాపక అధికారి మాట్లాడుతూ.. కంపెనీలో విద్యుత్ కేబుల్స్ అధికంగా వేడెక్కడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, కేవలం కంపెనీలోని మెటీరియల్ మాత్రమే అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. యంత్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. అదేవిధంగా కంపెనీలోని ఎమర్జెన్సీ జనరేటర్ పనిచేయలేదనే అంశంపై కూడా పరిశీలన చేస్తామని చెప్పారు. ప్రస్తుతం కంపెనీ అంతటా దట్టమైన పొగ అలుముకోవడంతో లోపల పూర్తిస్థాయిలో పరిశీలించడం సాధ్యం కాలేదని, పొగ తగ్గిన తర్వాత ఎంత మేర ఆస్తి నష్టం జరిగిందో అంచనా వేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

పారిశ్రామిక ప్రాంతానికి ఫైర్ ఔట్‌పోస్ట్ అవసరం

హైతాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక సంస్థలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించేలా స్థానికంగా ఫైర్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జిల్లా అగ్నిమాపక అధికారి అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇండస్ట్రియల్ పార్కు పరిధిలో ఫైర్ ఔట్‌పోస్ట్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు భద్రతా చర్యలు, విద్యుత్ వ్యవస్థల నిర్వహణ, అత్యవసర సమయాల్లో పనిచేసే పరికరాల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. భారీ అగ్నిప్రమాదం జరిగినప్పటికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడి పూజ

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పడి పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి పడి పూజకు హిందూ ధర్మంలో ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. 41 రోజుల మండల దీక్ష చేపట్టే భక్తులు నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, భక్తిభావంతో స్వామివారిని ఆరాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణతో నిర్వహించే పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడమే కాకుండా సమాజంలో ఐక్యత, సోదరభావం, సేవాభావాన్ని చాటిచెబుతాయని తెలిపారు. అయ్యప్ప స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పడి పూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులకు, గురుస్వాములకు, అయ్యప్ప భక్తులకు తోకల శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాస్ రెడ్డి, శశికాంత్, సురేందర్ రెడ్డి, పృథ్వీ ముది రాజ్, ధనుష్ రెడ్డి, రామలింగం గురుస్వామి, చిన్న తదితరులు పాల్గొన్నారు.



మాతృ, శిశు మరణాల నివారణలో నర్సుల పాత్ర కీలకం

డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్

మంచిర్యాలలో నర్సింగ్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

మంచిర్యాల నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్) : మాతృ, శిశు మరణాల నివారణతోపాటు సురక్షిత ప్రసవాల సాధనలో నర్సుల సేవలు ఎంతో కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మంచిర్యాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో సుమారు 300 మంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలు అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షిత ప్రసవాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణలో నర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఫాతిమా జూలియట్, డాక్టర్ శ్రీధర్, ప్రేమ్ కుమార్, సుజాత, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, కిష్టన్న, అధ్యాపకులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేయించిన టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొకాపేటలోని బస్తీ దవాఖానాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు ఆరోగ్యమే పునాది అని, పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, గతంలో టీకాలు వేయించినప్పటికీ ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి చుక్కలు వేయించడం అవసరమని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యతగా భావించి ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొకాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గేష్ యాదవ్, సురేష్ అప్పా, నార్సింగి సర్కిల్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిస్మత్‌పూర్‌లో భక్తిశ్రద్ధలతో శ్రీ జగన్నాథ్ సంకీర్తన సేవ



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కిస్మత్‌పూర్ పూర్ణ గార్డెన్స్‌లో శ్రీ జగన్నాథ్ సంకీర్తన సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జగన్నాథ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి స్వామివారి నామస్మరణ, సంకీర్తన సేవలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుకున్నారు. భక్తుల సంకీర్తనలు, భజనలతో కార్యక్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో భజనలు, సంకీర్తనలకు ఎంతో విశిష్టమైన స్థానం ఉందన్నారు. భగవంతుని నామస్మరణ ద్వారా మనిషిలో భక్తిభావం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన పెంపొందుతాయని పేర్కొన్నారు. శ్రీ జగన్నాథ్ స్వామివారి సంకీర్తన సేవ వంటి కార్యక్రమాలు భక్తులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమాజంలో ఐక్యత, సోదరభావం, ధార్మిక చైతన్యాన్ని పెంపొంది స్తాయని అన్నారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ సంప్రదాయాలను భావితరాలకు అందిం చడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. శ్రీ జగన్నాథ్ స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు, శాంతి సమృద్ధులు కలగాలని ఆకాంక్షి చారు. ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, గోపాలకృష్ణ, శేఖర్ ముదిరాజ్, పవన్ సాయి, ఉదయ్, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీ జగన్నాథ్ సంకీర్తన సేవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నార్సింగి--మంచిరేవులలో ఘనంగా అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని నార్సింగి--మంచిరేవుల గ్రామంలో శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజ మహో త్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామివా రిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పడి పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి పడి పూజకు హిందూ ధర్మంలో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. 41 రోజుల మండల దీక్ష ద్వారా భక్తులు పాటించే నియమ నిష్ఠలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, భక్తిభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. స్వామియే శరణం అయ్యప్ప అనే నామస్మరణతో నిర్వహించే పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడమే కాకుండా సమాజంలో ఐక్యత, సోదరభావం, సేవాభావాన్ని చాటిచెబుతాయని తెలిపారు. అయ్యప్ప స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలం దరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసం తోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం పడి పూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులకు, అయ్యప్ప స్వాములకు, భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బలవంత రెడ్డి, రాకేష్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో మాడిఫైడ్ సైలెన్సర్ బైక్ పట్టివేత

కేసు నమోదు.. వాహనాన్ని అదుపులోకి తీసుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): నిబంధనలకు విరుద్ధంగా మాడిఫైడ్ సైలెన్సర్‌తో అధిక శబ్దం చేస్తూ రోడ్డుపై తిరుగుతున్న కవాసకి ఏస్ బైక్‌ను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆరాంఘర్ చౌరస్తా వద్ద పట్టుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల దృష్టికి మాడిఫైడ్ సైలెన్సర్‌తో ప్రయాణిస్తున్న ఈ ద్విచక్ర వాహనం వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌ను మార్చినట్లు గుర్తించారు. ఈ మేరకు వాహనదారుడిపై కేసు నమోదు చేసి బైక్‌ను అదుపులోకి తీసుకొని భద్రతా కస్టడీలో ఉంచారు. అంతేకాకుండా వాహనానికి అమర్చిన నిబంధనలకు విరుద్ధమైన మాడిఫైడ్ సైలెన్సర్‌ను తొలగించి, దాని స్థానంలో ప్రామాణికమైన సాధారణ సైలెన్సర్‌ను అమర్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు సూచిస్తూ ద్విచక్ర వాహనాలకు అనధికారికంగా సైలెన్సర్లను మార్చడం, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం చట్టవిరుద్ధమని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ తనిఖీలను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన డెల్టా-24 బృందం చేపట్టింది.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 సోమవారం 23-11-2026





హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమం

గండిపేట(క్రైమ్ మిర్రర్): పోలియో రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా హైదర్ గూడ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో ఐదేళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలను వేయించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు వేయించే రెండు చుక్కల పోలియో మందు వారి నిండు జీవితానికి ఆరోగ్య భద్రత కల్పిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. చిన్నారుల భవిష్యత్తును అంగవైకల్యం నుంచి కాపాడటంలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది రాణి, బీజేవైఎం రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కుక్కునూరి కిరణ్ చారి, బీజేపీ క్రియాశీల సభ్యురాలు సాబాధ స్వప్న, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయొద్దు.. పిల్లల భవిష్యత్తు కోసం ముందస్తు జాగ్రత్త అవసరం

- సేవా రత్న అవార్డు గ్రహీత ఆడికే మహేందర్



గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో టీకాలు వేయించాలని సేవా రత్న అవార్డు గ్రహీత, మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడికే మహేందర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా చిన్నారులను రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో టీకాలకు దూరం కాకుండా చూడాలని ఆడికే మహేందర్ విజ్ఞప్తి చేశారు.

మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా ఆర్ఎస్ఎస్ పథసంచలన్

స్వయం సేవకులకు పూలు చల్లి ఘన స్వాగతం పలికిన బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి





గండిపేట్‌క్రైమ్ మిర్రర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి నగర్--చార్మినార్ భాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పథసంచలన్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సేవకులకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. క్రమశిక్షణతో వరుసగా అడుగులు వేస్తూ పథసంచలన్‌లో ముందుకు సాగిన స్వయం సేవకులను ఆయన అభినందించారు. వారి క్రమశిక్షణ, దేశభక్తి, సేవా తత్పరతను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ దేశంలో జాతీయ భావజాలం, దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావం, సామాజిక సమరసతను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ పథసంచలన్ కేవలం ఒక కవాతు మాత్రమే కాదని, సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, అంకితభావం, దేశం పట్ల బాధ్యతను చాటిచెప్పే కార్యక్రమమని అన్నారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవా దృక్పథం పెంపొందాలని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, జాతీయ విలువలను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని, విపత్తుల సమయంలోనూ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, సానుకూల ఆలోచనలు, సామాజిక సేవ పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. పథసంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులందరికీ మరోసారి పూలు చల్లి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోకల శ్రీశైలం రెడ్డి, భార్గవ్ జీ, రంగ రామాంజనేయ జీ, ఎర్ర రాజు జీ, పల్లపు జగన్ జీ, మాణిక్ లాలీ యాదవ్, పెండ్యం విజయ్ కుమార్, పాండు యాదవ్, లక్ష్మీ, అడికే జనార్ధన్, రావుల భాస్కర్, శ్రీధర్ యాదవ్, సంతోష్ గౌడ్, గోపాల్ నాయక్, చిన్న, శ్రీకాంత్ రెడ్డి, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తు.. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్

గండిపేట్‌క్రైమ్ మిర్రర్: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని కాటేదాన్ డివిజన్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ పాల్గొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ రెండు చుక్కలు చిన్నారుల బంగారు భవిష్యత్తుకు రక్షణ కవచమని పేర్కొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు అందించగలిగే గొప్ప ఆస్తి ఆరోగ్యమని, చిన్నారుల ఆరోగ్య భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, గతంలో టీకాలు వేయించినప్పటికీ ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి చుక్కలు వేయించాలని కోరారు. చిన్నారి చిరునవ్వు చెదరకుండా, వారి చిట్టి అడుగులు ఆగిపోకుండా పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హైదర్ గూడలో పల్స్ పోలియో కార్యక్రమం..

చిన్నారులకు చుక్కలు వేసిన కోలన్ సుభాష్ రెడ్డి

గండిపేట్‌క్రైమ్ మిర్రర్: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా హైదర్ గూడ డివిజన్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలన్ సుభాష్ రెడ్డి పాల్గొని హైదర్ గూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా కోలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. చిన్నారుల భవిష్యత్తులో పోలియో కారణంగా అంగవైకల్యం ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని, గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికీ ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి టీకాలు వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాద్యం రమేశ్వర్ రావు, మొండ్ర కొమురయ్య, హైదర్ గూడ డివిజన్ అధ్యక్షుడు చిట్టిగారి నరేందర్ రావు, పోయిల జీవన్ దాస్, జాలిగం చిత్తారి, ఎడ్లకాడి సూర్యం, సులిగే వెంకటేష్, సనివేల్లి జయవర్ధన్ రెడ్డి, కొండమీది హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమం

గండిపేట్‌క్రైమ్ మిర్రర్: చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి గండిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, మాజీ కౌన్సిలర్ ఉషారాణి,మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ సాయిరాం ముదిరాజ్ హాజరయ్యారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ ంన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన తెలంగాణ రక్షణ సేన నాయకులు సర్వేష్ ముదిరాజ్



గండిపేట్‌క్రైమ్ మిర్రర్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుడు సర్వేష్ ముదిరాజ్ చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిన్నారుల ఆరోగ్య భద్రత విషయంలో తల్లిదండ్రులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో టీకాలకు దూరం కాకుండా చూడాలని అన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాతర్ల దశరథ్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బైరాగిగూడ ప్రాథమిక పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమం

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే మన ప్రథమ కర్తవ్యం

కాంగ్రెస్ నాయకుడు నల్లగొప్పుల హరీష్ గౌడ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 123వ హైదర్షాకోట్ డివిజన్ పరిధిలోని బైరాగిగూడ ప్రాథమిక పాఠశాలలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నల్లగొప్పుల హరీష్ గౌడ్ పాల్గొని చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా హరీష్ గౌడ్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి పిల్లలను కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పోలియో వ్యాధి, దాని నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. పోలియో వైరస్ చిన్నారుల నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి శాశ్వత అంగవైకల్యానికి కారణమయ్యే ప్రమాదం ఉందని, అయితే సకాలంలో పోలియో టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, గతంలో పలుమార్లు పోలియో చుక్కలు వేసినప్పటికీ ప్రభుత్వం నిర్వహించే ప్రతి పల్స్ పోలియో కార్యక్రమంలో మరోసారి టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఒక్క చిన్నారి కూడా టీకాకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పోలియో రహిత భారతదేశ నిర్మాణానికి ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని, చిన్నారుల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు పునాది అని ఈ సందర్భంగా హరీష్ గౌడ్ పేర్కొన్నారు.

నార్సింగిలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు

పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ ఉషారాణి



గండిపేట(క్రైమ్ మిర్రర్): చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నార్సింగిలోని 4వ, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉషారాణి పాల్గొని చిన్నారులకు స్వయంగా రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. చిన్నారులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు టీకాలు వేయించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, అన్నపూర్ణ, ఆశా వర్కర్ శంకరమ్మ తదితరులు పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వట్టినాగులపల్లిలో పల్స్ పోలియో కార్యక్రమం

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించిన కాంగ్రెస్ నాయకులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 126వ గండిపేట డివిజన్ వట్టినాగులపల్లి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మైలారం ప్రదీప్ కుమార్ టక్కు, కుమ్మరి శేఖర్, అరుణ్ బూదల ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలను అందించారు. చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నాయకులు సూచించారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని, చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మున్నీ భాయ్, ఇంద్ర, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

వెంకటపూర్‌లో ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్

కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా

మందమర్రి నవంబర్ 22 (క్రైమ్ మిర్రర్)ూ: పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం ఆదివారం మందమర్రి మండలం వెంకటపూర్‌లో ప్రారంభమైంది. గ్రామ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో సర్పంచ్ వెంకటేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ. 5 లక్షల బీమా పరిహారం అండగా నిలుస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంపూర్ణ పోలియో రక్షణే లక్ష్యం

తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా చుక్కల మందు పంపిణీ



గండిపేట్, (క్రైమ్ మిర్రర్): జాతీయ వ్యాధి నిరోధక దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలోని విభాగ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నార్సింగి గ్రామీణ ఆరోగ్య కేంద్రం సమన్వయంతో, అకాడమీ వైద్యాధికారిణి డాక్టర్ రమాదేవి మరియు ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు వయస్సు గల నలభై మందికి పైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రతి చిన్నారికి పోలియో వ్యాధి నుంచి సంపూర్ణ రక్షణ కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నార్సింగి గ్రామీణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సహకారం, సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అకాడమీ సిబ్బంది మరియు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల్లో సీఎంఆర్ఎఫ్ భరోసా

లబ్ధిదారునికి రూ.20 వేల చెక్కు అందజేత: సర్పంచి శ్రీలత



మందమర్రి, నవంబరు 22 క్రైమ్ మిర్రర్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని చిర్రకుంట సర్పంచి రాంటెంకీ శ్రీలత తిరుపతి అన్నారు. మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన ఎనగందుల రాజయ్యకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 20 వేల చెక్కును ఆదివారం ఆమె అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రమాదాలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి సంజీవనిలా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన వారు ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి

గండిపేట(క్రైమ్ మిర్రర్): చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మణికొండ--నెక్నాంపూర్ డివిజన్ పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. మనికొండ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి పాల్గొని చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి తల్లిదండ్రి, ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నెక్నాంపూర్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ప్రభావతి, నాయకులు గంగాధర్, సంతోష్, శివగంగ తదితరులతో పాటు పల్స్ పోలియో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ చిన్నారులకు రెండు చుక్కల పోలియో టీకాలు వేశారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో మహమ్మారిని పూర్తిగా నివారించి, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక్క చిన్నారికి కూడా పోలియో చుక్కలు వేయకుండా మిగిలిపోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వంతో పాటు ప్రజలందరి బాధ్యత అని, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానిక నాయకులు, బాస శ్రీనివాస్ నేత,గట్టయ్య, నాయకులు,కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గోశాలలో గడ్డివాముకు నిప్పు

రూ.1.50 లక్షల నష్టం.. గోవుల మేత బుగ్గిపాలు



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, నవంబర్ 22: అవంతిపురం కొండపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ గోశాలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోవుల మేత కోసం నిల్వ చేసిన గడ్డివాము మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ. 1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. గోవులకు అవసరమైన పశుగ్రాసం బూడిద కావడంతో ఆలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన ఆలయ సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ అక్కడికి చేరుకునేలోపే మంటలు వేగంగా వ్యాపించి గడ్డివాములో సగానికి పైగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో మిగిలిన గడ్డివాము కూడా పూర్తిగా అగ్నికి ఆహుతైంది.

ఆకతాయిల ఆగడాలతోనేనా?

ఆలయ ఈఓ రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఆలయ పరిసర ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు మద్యం సేవించడం, ధూమపానం చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గడ్డివాముకు నిప్పు పెట్టి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ పరిసరాల్లో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



ఆఫీసర్ ఆన్ డ్యూటీ

గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు... చాన్స్ లభించాలే కానీ ఫైట్స్ చేసేందుకు ఏమాత్రం వెనకడుగు వేసేది లేదంటున్నారు హీరోయిన్స్. ఈ క్రమంలోనే కొందరు కథానాయికలు ఖాకీ డ్రెస్ ధరించి, లాఠీ పట్టారు. వెండితెరపై అన్యాయంపై న్యాయంగా పోరాడుతున్నారు. ఇలా ఆఫీసర్స్‌గా డ్యూటీ చేస్తున్న కొందరు హీరోయిన్స్‌పై ఓ లుక్ వేయండి.

ఆపరేషన్ ఓం

ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే ముఠా ఆటకట్టించడానికి ఓ స్టింగ్ ఆపరేషన్ ఆరంభించారు నిత్యా రెడ్డి. ఇదే 'ఆపరేషన్ ఓం'. నిజాయతీ, తెలివి, అనుభవం ఉన్న అమ్మాయి నిత్యా రెడ్డి. ఆమె తండ్రి ఓ ఫారెస్ట్ ఆఫీసర్. మరి... యంగ్ ఆఫీసర్ నిత్య చేపట్టిన 'ఆపరేషన్ ఓం' ఏమైంది? అనేది తెలుసుకోవాలంటే ఈ నెల 20న రిలీజ్ కానున్న 'ఓం: చాప్టర్ 1--ఉధిరం బ్లడ్ ఉడ్' చూడాలి. ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్స్‌గా నటించగా, మమ్ముట్టి, నసీరుద్దీన్ షా కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో నాయుడు పేటకి చెందిన ఐపీఎస్ ఆఫీసర్ నిత్యా రెడ్డి పాత్రలో సాయి పల్లవి నటించారు. పోలీస్ ఆఫీసర్‌గా ఆమె నటించిన తొలి చిత్రం ఇది.

భయపడే పోలీస్ ఆఫీసర్!

చిన్న చిన్న విషయాలకే భయపడే ఓ పోలీస్ ఆఫీసర్ ప్రపంచాన్నే నాశనం చేయాలనుకునే దుష్టశక్తులను ఎలా ఎదుర్కొంది? ఈ ప్రయాణంలో ఈ పోలీస్ ఆఫీసర్‌కు అమ్మవారి నుంచి ఎలాంటి సాయం లభించింది? అన్న అంశాల నేపథ్యంలో రూపొందిన సినిమా 'మూకుత్తి అమ్మన్ 2'. ఈ సినిమాకు తెలుగులో 'మహాశక్తి' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రంలో నయనతార ద్విపాత్రాభినయం (పోలీస్ ఆఫీసర్, అమ్మవారు) చేశారు. దునియా విజయ్, రెజీనా నెగటివ్ రోల్స్ చేశారు. సుందర్. సి దర్శకత్వంలో ఇషారి కె. గణేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది.

బి బ్లాక్ గోల్డ్

హీరోయిన్ సంయుక్త నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది బ్లాక్ గోల్డ్'. వాస్తవ ఘటనల స్ఫూర్తితో తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దులోని బొగ్గు గనుల నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో సంయుక్త పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించారు. దేశాన్ని కుదిపేసిన కోల్ సిండికేట్‌ల బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథనం సాగుతుందని తెలిసింది. ఈ సినిమా కోసం సంయుక్త కొన్ని రిస్కీ యాక్షన్ స్టంట్స్ చేశారు. కేఎమ్‌సీ యోగేష్ దర్శకత్వంలో మాగంటి పిక్చర్స్ సహకారంతో హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది.

మంగళ గౌరి

పోలీస్‌గా తొలిసారి ఖాకీ యూనిఫామ్ ధరించారు హీరోయిన్ రుక్మిణీ వసంత్. రాహుల్ పీకే దర్శకత్వంలో రుక్మిణీ వసంత్, మాలాశ్రీ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న కన్నడ సినిమా 'మంగళ గౌరి'. ఈ చిత్రంలో పోలీస్ గౌరి పాత్రలో రుక్మిణీ వసంత్, మంగళ పాత్రలో మాలాశ్రీ నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఇద్దరు సాధారణ మహిళలు ఎందుకు ఓ అసాధారణ ప్రయాణాన్ని ప్రారంభించాల్సి వచ్చింది? వారి జీవితంలో ఏం జరిగింది? అన్న అంశాల నేపథ్యంలో ఈ 'మంగళ గౌరి' కథనం సాగుతుందని తెలిసింది.

'కొత్త హీరోలకు అదొక్కటే దిక్కు'



అనీష్ హీరోగా పరిచయమవుతున్న సినిమా 'ఇట్లు అర్జున'. నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే మూవీ ప్రమోషన్స్ గట్టిగానే చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరో నాగార్జున తొలి సినిమా విడుదలకు ముందు నటీనటులు పడే ఆందోళన, నేటితరం ఎదుర్కొంటున్న పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

రిలీజ్‌కు ముందు

'మొదటి చిత్రం రిలీజ్‌కు ముందు రోజుల్లో మనసులో ఎన్నో ఆలోచనలు తిరుగుతుంటాయి. సినిమా కోసం ప్రాణం పెట్టి కష్టపడతాం, ఆ గుర్తింపును కాపాడుకోవడానికి నిరంతరం పరిగెడుతూనే ఉండాలి. ముఖ్యంగా ఇండస్ట్రీకి కొత్తగా పరిచయమయ్యే డెబ్యూ హీరోలకైతే ఆ టెన్షన్ మామూలుగా ఉండదు. ఆ ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికి ఏకైక మార్గం ప్రశాంతంగా నిద్రపోవడమే' అంటూ తన అనుభవాలను పంచుకున్నారు.

మేము చాలా అదృష్టవంతులం

'మా సమయంలో సోషల్ మీడియా లేదు కాబట్టి మేము చాలా అదృష్టవంతులం. కానీ ప్రస్తుతం సోషల్ మీడియా ఓ రాక్షసిలా మారింది. అందుకే ఈ రంగంలోకి వచ్చే కొత్త హీరోలు మానసికంగా గట్టిగా సిద్ధపడి రావాలి' అని స్పష్టం చేశారు.

కొడుకు ఫొటో రివీల్ చేసిన నటి కత్రినా కైఫ్

బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ అభిమానులకు సర్‌ప్రైజ్ చేశారు. ఇప్పటివరకు రహస్యంగా ఉంచిన తమ కొడుకు 'విహాన్ కౌశల్' ముఖాన్ని తొలిసారిగా ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ క్యూట్ ఫ్యామిలీ ఫొటో ఇప్పుడు నెట్టింట వైరల్ మారింది.సోషల్ మీడియా వేదికగా తమ ఫ్యామిలీ ఫోటోను పంచుకుంటూ అభిమానులకు దీవాళి శుభాకాంక్షలు తెలియజేశారు. 'మా జీవితంలో అత్యంత ప్రకాశవంతమైన దీపావళి ఇది.. అందరికీ ప్రేమ, వెలుగులు, సంతోషం కలగాలని కోరుకుంటున్నాం.' అని తమ కొడుకుతో ఉన్న ఫొటోను రివీల్ చేస్తూ పోస్ట్ చేశారు.



కమల్‌హాసన్ కూడా చేయని పాత్ర

'నటులందరికీ కొలమానం కమల్‌హాసన్. ప్రపంచ సినీచరిత్రలో ఆయన చేసినన్ని వైవిధ్యమైన పాత్రలు ఎవరూ చేయలేదు.. చేయబోరు. అయితే.. 'గాయపడ్డ సింహం'లో నేను పోషించిన 'ధర్మ' తరహా పాత్ర ఆయనక్కూడా రాలేదు. ఆయన కూడా చేయలేదు. ఇది నాకు మాత్రమే దక్కిన అదృష్టం. ఈ పాత్రలో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇది నా కెరీర్‌లోనే గుర్తుండిపోయే పాత్ర. కశ్యప్ తప్పకుండా ఇన్నోవేటివ్ డైరెక్టర్ అవుతాడు. పవన్ సాధినేని భుజాలపై ఈ సినిమాను మోశాడు. ఇది డైరెక్టర్స్ సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది' అని జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్‌భాస్కర్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'గాయపడ్డ సింహం'.జేడీ చక్రవర్తి కీలక పాత్ర పోషిస్తున్నారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకుడు. చక్రవర్తి మంతిన, భానుకిరణ్ ప్రతాప, విజయ్‌కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సాల్ నిర్మాతలు. పవన్ సాధినేని సమర్పకుడు. మే 1న సినిమా రిలీజ్ కానుంది. జేడీ చక్రవర్తి పోషిస్తున్న ధర్మ పాత్రను పరిచయం చేస్తూ రూపొందించిన గ్లింప్స్‌ని సోమవారం హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో జేడీ చక్రవర్తి మాట్లాడారు. ఇందులో జేడీ చక్రవర్తి మాఫియా డాన్‌గా నటిస్తున్నట్టు గ్లింప్స్ చెబుతున్నది. మాఫియా డాన్ ధర్మ చేసే ఆయుధాల అక్రమ రవాణా, డ్రగ్స్ తదితర యాక్టివిటీస్‌ని ఈ గ్లింప్స్‌లో చూడొచ్చు. జేడీ చక్రవర్తి స్క్రీన్‌ప్రెజెన్స్, 'బ్రూటల్ ధర్మ'గా ఆయన మేకోవర్ ఆకర్షణీయంగా ఉంది. ఇంకా ఈ కార్యక్రమంలో పవన్ సాదినేని, డైరెక్టర్ కశ్యప్, నిర్మాత భాను కిరణ్ ప్రతాప కూడా మాట్లాడారు.



రజనీకాంత్ కథానాయకుడిగా అశ్వత్ మారిముత్తు రూపొందిస్తున్న కొత్త సినిమా 'ధర్మన్'. రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఇందులో హీరో రామ్ పోతినేని ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఆయన పాత్రను పరిచయం చేస్తూ చిత్ర బృందం వీడియోను పంచుకుంది. 'రా.. యాటిట్యూడ్.. పవర్.. ఓవర్‌లోడెడ్.. అందరికీ స్వాగతం' అని చిత్ర బృంద పేర్కొంది. ఈ సినిమాలో రజనీ డాక్టర్‌గా కనిపించనున్నారు. తన కూతురిగా రాశి నటిస్తున్నారు. అల్లుడి పాత్రలో రామ్ కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది.



రెజీనా కీలకపాత్రలో మైత్రీ కొత్త చిత్రం..

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో ఆసక్తికరమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్‌కు చెందిన జీ స్క్వాడ్ సంస్థతో కలిసి నిర్మిస్తున్న కొత్త సినిమాకు '=శ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దీపావళి సందర్భంగా ఈ టైటిల్‌ను ప్రకటించిన చిత్రబృందం, సత్యం కోసం జరిగే ఒంటరి పోరాటం నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్లు సంకేతాలు ఇచ్చింది. రెజీనా కసాండ్రా, నాజర్, రమేష్ తిలక్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి విశాల్ వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం తదుపరి నిర్మాణ కార్యక్రమాల దశలో ఉన్నట్లు సమాచారం.

'ధర్మన్' నుంచి రామ్ అప్‌డేట్ వచ్చేసింది



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.